
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
మంగళవారం 8 జూలై 2025



సమాచారం

దరఖాస్తుల ఆహ్వానం

షాబాద్, జూలై 7(ఆంధ్రజ్యోతి): టీజీడబ్ల్యూఆర్ఎస్(బాలికల) ఆమనగల్లు గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ వినోల సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టీజీటీ తెలుగు, పీజీటీ ఇంగ్లిష్, పీజీటీ ఫిజికల్ సైన్స్, జేఎల్ బోటనీ, జేఎల్ ఫిజిక్స్‌లో ఖాళీలు ఉన్నాయని, నేడు(మంగళవారం) డెమో క్లాసులు ఉంటాయని తెలిపారు. ఆసక్తి గలవారు సర్టిఫికెట్లు ఒక జిరాక్స్ సెట్ తీసుకొని షాబాద్‌లోని పీఆర్ఆర్ కళాశాలలో హాజరు కావాలని కోరారు. వివరాలకు 79950 10617లో సంప్రదించాలని సూచించారు.

దుకాణాలకు వేలం

శంకర్‌పల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని డబుల్ బెడ్‌రూమ్ హౌసింగ్ కాలనీలోని దుకాణాలకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు డబుల్ బెడ్‌రూమ్ హౌసింగ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈనెల 9వ తేదీన హౌసింగ్ కాలనీలోని 42 దుకాణాలకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు డబుల్ బెడ్‌రూమ్ హౌసింగ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్‌ను సంప్రదించాలని సూచించారు.

నేడు బీఎల్‌వోలకు శిక్షణ


కేశంపేట, జూలై 7(ఆంధ్రజ్యోతి): కేశంపేట మండల బూత్ లెవల్ అధికారు(బీఎల్‌వో)లకు మంగళవారం శిక్షణ ఉంటుందని కేశంపేట తహసీల్దార్ మీర్ అజాంఅలీ సోమవారం ప్రకటనలో తెలిపారు. కొత్తపేట రైతు వేదికలో శిక్షణ ఉంటుందని వివరించారు. ఉదయం 9గంటలకు బీఎల్‌వోలు రైతు వేదికకు చేరుకోవాలని సూచించారు. ప్రతి బీఎల్‌వో శిక్షణకు హాజరు కావాలని కోరారు.

పదవుల పందేరం!

సవాల్‌గా కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణం

స్థానిక ఎన్నికలకు ముందే అధికార కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి సారించింది. ఇప్పటికే పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను పీసీసీ నియమించిన సంగతి తెలిసిందే. సంస్థాగత నిర్మాణ ప్రక్రియను పూర్తి చేసేందుకు సోమవారం ఉమ్మడి జిల్లాల వారీగా ఇన్‌చార్జిలను నియమించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జిగా రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె.శివసేనారెడ్డిని పార్టీ అధినాయకత్వం నియమించింది. అలాగే గ్రామ స్థాయి నుంచి జిల్లా కమిటీల ఏర్పాటుకు సన్నాహాలు చేపట్టింది. భారీ సంఖ్యలో ఆశావహులు ఉండటంతో ఎంపిక ప్రక్రియ పార్టీ నాయకత్వానికి సవాల్‌గా మారింది.

- స్థానిక ఎన్నికలకు ముందే పోస్టులన్నీ భర్తీ
- గ్రామస్థాయి నుంచి జిల్లా కమిటీల ఏర్పాటుకు సన్నాహాలు
- భారీ సంఖ్యలో ఆశావహులు..
- తలనొప్పిగా ఎంపిక ప్రక్రియ
- మండల అధ్యక్ష పదవులకూ పదుల సంఖ్యలో దరఖాస్తులు
- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిగా శివసేనారెడ్డి నియామకం



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి):

పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జిలను ప్రకటించిన వెంటనే వారితో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ సోమవారం జూమ్ మీటింగ్ కూడా నిర్వహించడం గమనార్హం. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి కమిటీల ఏర్పాటుపై విధివిధానాలు వారికి వివరించారు. పార్టీ సంస్థాగత నిర్మాణ పక్రియను ప్రారంభించేందుకు వెంటనే రంగంలో దిగాలని ఆదేశించారు. దీంతో కొన్నాళ్లుగా నానుస్తూ వచ్చిన సంస్థాగత ఎన్నికల పక్రియ త్వరలోనే పూర్తికానుంది. అయితే సంస్థాగత ఎన్నికల నిర్వహణ పార్టీకి పెద్ద సవాల్ అనే చెప్పాలి. రాజకీయంగా ఎంతో కీలకమైన ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పరిస్థితి మరింత సంక్లిష్టంగా ఉంది. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర

మిగతా 7వ పేజీలో...

అధ్యక్ష పదవులకు పోటా పోటీ

పార్టీ పదవుల పంపకంపై క్షేత్రస్థాయిలో పార్టీ అధినాయకత్వం అభిప్రాయ సేకరణ నిర్వహించి ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. వీటికి పలు నియోజకవర్గాల్లో భారీ స్పందన లభించింది. మండల, బ్లాక్ అధ్యక్ష పదవులకు పదుల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. డీసీసీ అధ్యక్ష పదవులకు కూడా భారీగానే డిమాండ్ ఉంది. పలువురు కీలక నేతలు ఈ పదవులను ఆశిస్తున్నారు. పదవుల కోసం ఎక్కువ మంది దరఖాస్తు చేసుకోవడంతో వీరి ఎంపిక నాయకత్వానికి సవాల్‌గా మారనుంది. దరఖాస్తులను క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేసి అర్హత ఉన్న నేతల పేర్లను సిఫారసు చేస్తూ జాబితాను పీసీసీకి పంపారు. గ్రామ, మండల అధ్యక్ష పదవులకు సంబంధించి ఐదుగురు పేర్లను, బ్లాక్ అధ్యక్ష పదవులకు ముగ్గురు పేర్లను టీపీసీసీకి పంపారు. పదవుల పంపిణీలో సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఇటీవల అభిప్రాయ సేకరణ చేసిన సమయంలో పరిశీలకులు ఆశావహులతో భేటీ అయి పార్టీ నిర్ణయాలకు కట్టుబడి ఉండాలని చెప్పారు. పార్టీ నిర్మాణానికి తోడ్పడిన వారి భవిష్యత్తు పార్టీ చూసుకుంటుందని భరోసా ఇచ్చారు.



వినతిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

» అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

రంగారెడ్డి అర్బన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆమె డీఆర్వో సంగీతతో కలిసి ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మొత్తం 62 దరఖాస్తులు రాగా రెవెన్యూ శాఖకు సంబంధించి 29, ఇతర శాఖల నుంచి 33 వచ్చినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, సూపరింటెండెంట్లు, మున్సిపల్, తహసీల్దార్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

● ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, జూలై 7(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. నియోజకవర్గ స్థాయి యువజన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం సోమవారం మైసిగండిలోని ఎస్కే ప్యాలెస్‌లో నిర్వహించారు. పార్టీ బలోపేతం, ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు పేదలకు అందేలా చొరవ తీసుకోవాలని కోరారు. నామినేటెడ్, పార్టీ పదవుల్లో, స్థానిక ఎన్నికల్లో అవకాశాలు ఇస్తామని చెప్పారు. బీఆర్ఎస్ విషప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి లక్ష్మీకాంత్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జిలు రామచంద్రారెడ్డి, అరవింద్, నియోజకవర్గ అధ్యక్షుడు దళపతిగౌడ్, తాలూకా ఇన్‌చార్జిలు దయాసాగర్‌రెడ్డి, బాలకోటి, శ్రీకాంత్, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి జి.శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్, అనంతరెడ్డి, నారాయణ, బిచ్యా, రవి, అభినవ్‌రెడ్డి, క్యామ రాజేశ్, అనిల్‌గౌడ్, షాబుద్దీన్, అనిల్, నరేశ్, బాల్‌రాజ్, శ్రీకాంత్, శివగౌడ్, బాల్‌రాజ్, భరత్‌గౌడ్, ఇమ్రాన్ బాబా తదితరులు పాల్గొన్నారు.

చట్టాలను కాలరాస్తున్న కేంద్రం



సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

- » లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి
- » దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి
- » వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమ్మినేని వీరభద్రం

ఇబ్రహీంపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు, కర్షకులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమ్మినేని వీరభద్రం విజ్ఞప్తి చేశారు. సోమవారం ఇబ్రహీంపట్నంలో ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎనిమిది గంటల పనిదినాన్ని 10 గంటలకు పెంచడం సరికాదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు పెంచాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించకుండా కార్మికులతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలన్నారు. ఉపాధి హామీ పనిదినాలను రెండు వందలకు పెంచాలన్నారు. వ్యవసాయ కూలీలకు కనీస వేతన చట్టాలు తీసుకురావాలన్నారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతీ మహిళకు వెంటనే రూ.2500 ఇవ్వాలన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను కారు చౌకగా ప్రైవేట్ వారికి కట్టబెడుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు పగడాల యాదయ్య, చంద్రమోహన్, మధుసూదన్‌రెడ్డి, జగన్, సుమలత, కవిత, ప్రకాశ్‌కారత్, శంకర్, గణేష్, విజయమ్మ, సామేల్ జంగయ్య, నర్సింహ, ఎల్లేష్ బుగ్గరాములు, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

జీవో 282 కాపీలు దహనం

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో సాగర్ రహదారిపై నిరసన తెలిపి జీవో 282 కాపీలను దహనం చేశారు. కార్పొరేట్ లాభాల కోసమే ఎనిమిది గంటల పనిదినాన్ని 10 గంటలకు మారుస్తూ ఈ జీవోను తీసుకువచ్చారని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ అన్నారు. శ్రమ దోపిడీకి గురిచేసే ఈ జీవో తోపాటు నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకువస్తుందని ఆరోపించారు.

ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలి

» టీయూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మునీర్ పాషా



శంకర్‌పల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులతో పాటు స్కూల్ అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీలను చేపట్టాలని టీయూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి మునీర్ పాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శంకర్‌పల్లిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీ బదిలీలలో గరిష్ఠంగా ఐదేళ్లు ఉండేలా చూడాలని కోరారు. ఉపాధ్యాయ సాధారణ బదిలీలు ఎనిమిదేళ్లు ఉండటం, 317జీవో వల్ల ఇప్పటికే చాలా మంది ఉపాధ్యాయులు మానసిక ఒత్తిడికి లోనవుతున్నారన్నారు. అదేవిధంగా దూర ప్రాంతాలలో పనిచేసే కొందరు ఉపాధ్యాయులు పైరవీలతో డిప్యుటేషన్ చేయించుకుంటున్నారని ఆరోపించారు. దీనికంతటికీ హెచ్‌ఆర్ఏలో భారీ తేడాలు ఉండటమేనన్నారు. గ్రామీణ ప్రాంతాలలో పనిచేసే ఉపాధ్యాయుల హెచ్‌ఆర్ఏను సైతం 20శాతానికి పెంచాలని కోరారు. బదిలీలలో గందరగోళమైన నిబంధనలు ఉండటంతో దూర ప్రాంతాలలో పనిచేసే ఉపాధ్యాయులు నష్ట పోతున్నారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా జీహెచ్ఎం బదిలీలతో పాటుగా మిగతా ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలని కోరారు.

గోశాలకు భూమిపూజ.. అడ్డగింత

పరిహారం తేల్చాలని రైతుల ఆందోళన



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రకళ, తహసీల్దార్ గౌతంకుమార్

ఎన్కేపల్లిలో ఉద్రిక్తత

- ఆందోళనల మధ్యే భూమి పూజ చేసిన ఎమ్మెల్యే యాదయ్య
- ప్రభుత్వ ఆదేశాలను అమలు చేస్తామన్న ఆర్డీవో, తహసీల్దార్



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రత్నం

మొయినాబాద్ రూరల్, జూలై7(ఆంధ్యజ్యోతి): మొయినాబాద్ మున్సిపాలిటీ ఎన్కేపల్లిలోని సర్వే నంబర్ 180లో 99.14 ఎకరాల ప్రభుత్వ స్థలంలో నిర్మించబోయే గోశాల భూమి పూజను స్థానిక రైతులు అడ్డుకున్నారు. సోమవారం ఉదయం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ముఖ్యఅతిథిగా భూమి పూజ చేస్తున్న విషయం తెలుసుకున్న ఎన్కేపల్లి రైతులు అక్కడికి చేరుకొని ఆందోళన చేపట్టారు. తమకు పరిహారం ఇవ్వకుండా, కనీసం సమాచారం లేకుండా భూమి పూజ ఎలా చేస్తారని అభ్యంతరం తెలిపారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆందోళనల మధ్యే ఎమ్మెల్యే భూమి పూజ నిర్వహించి, అనంతరం అక్కడి నుంచి వెళ్లి పోయారు. ఈ నేపథ్యంలో రైతులు ఎమ్మెల్యే, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం చేవెళ్ల ఆర్డీఓ రైతులతో మాట్లాడారు.

నిర్మాణ పనులు ఆపేది లేదు : ఆర్డీవో చంద్రకళ

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్కేపల్లిలో గోశాలను నిర్మాణ పనులను ఎట్టి పరిస్థితిలో ఆపేది లేదని చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ, మొయినాబాద్ తహసీల్దార్ గౌతంకుమార్ స్పష్టం చేశారు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడ సాగు చేసుకుంటున్న సుమారు 50 కుటుంబాల ఆవేదనను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లామని, కలెక్టర్, ఎమ్మెల్యే సూచనల మేరకు ఎకరాకు 300 గజాల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని

మిగతా 8వ పేజీలో...

సాగు భూములను లాక్కోవడం సరికాదు

ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న వందల ఎకరాల భూములను లాక్కొని 100 గజాల స్థలం ఇవ్వడం సరికాదని, ప్రభుత్వం ఈ విషయంలో పునరాలోచన చేయాలని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత రత్నం అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన బీజేపీ నాయకులతో కలిసి ఎన్కేపల్లిలో గోశాల ఏర్పాటు చేయనున్న ప్రభుత్వ స్థలాన్ని ఆయన పరిశీలించారు. అక్కడి రైతులతో మాట్లాడారు. అనంతరం అక్కడే ఉన్న మొయినాబాద్ తహసీల్దార్ గౌతం కుమార్‌తో మాట్లాడుతూ.. ఇదే విషయంపై తమ చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పూర్తి వివరాలతో ముఖ్యమంత్రిని కలిసి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని, అప్పటి వరకు ఈ స్థలంలో ఎలాంటి పనులు చేపట్టవద్దని కోరారు. ఆయన వెంట రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాష్, సన్‌వెల్లి ప్రభాకర్ రెడ్డి, ఓబీసీ జిల్లా కన్వీనర్ ఎల్గని వెంకటేష్ గౌడ్, భీమేందర్‌రెడ్డి, గరుగు రాజు, మొయినాబాద్ మున్సిపల్ అధ్యక్షుడు మాదాపురం శ్రీకాంత్, నర్సింహ్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, ప్రభాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



క్రమశిక్షణకు మారుపేరు కేజీబీవీలు

అదనపు గదుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

7

కొత్తపేటలో మట్టి అక్రమ తవ్వకాలు

అధికారుల రంగ ప్రవేశంతో నిలిపివేత

8

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



ఇబ్రహీంపట్నంలో ర్యాలీ తీస్తున్న విద్యార్థులు

» పట్నంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాస్తారోకో

ఇబ్రహీంపట్నం: జూలై 7 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం ఇబ్రహీంపట్నంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కేవై.ప్రణయ్, బి.శంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆరేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం ఆడుకుంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. బకాయిలు ఉండటంతో సర్టిఫికెట్లు ఇవ్వకుండా కళాశాల యాజమాన్యాలు విద్యార్థులను వేధింపులకు గురిచేస్తున్నాయన్నారు. దీంతో స్టూడెంట్స్ చదువులు మానుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికీ రూ.8700 కోట్ల బకాయిలు పేరుకుపోయాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలైనా ఈ విషయంలో తాత్సారం చేయడంలో అర్థం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, అరుణ్, వంశీ, తరంగ్, విప్లవ్ తదితరులున్నారు.



మీర్ఖాన్‌పేటలో లాటరీ తీస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, శశాంక

ప్లాట్లను ఎవరూ అమ్ముకోవద్దు

- ఫార్మా భూ బాధితులకు ఇంటి స్థలాల కేటాయింపు
- మీర్ఖాన్‌పేట ఏటీసీ సెంటర్‌లో లాటరీ ద్వారా అందజేత
- హాజరైన కలెక్టర్ నారాయణరెడ్డి, టీజీఐఐసీ చైర్మన్ శశాంక

కందుకూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): కందుకూరు, యాచారం మండలాలలో ఫార్మసిటీ కోసం భూములు ఇచ్చిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని హంగులతో అభివృద్ధి చేసి ఇస్తున్న ప్లాట్లను ఎవరూ అమ్ముకోవద్దని కలెక్టర్ నారాయణరెడ్డి, ఫ్యూచర్‌సిటీ, టీజీఐఐసీ చైర్మన్ శశాంక సూచించారు. సోమవారం మీర్ఖాన్‌పేట ఏటీసీ సెంటర్‌లో

మిగతా 8వ పేజీలో...

పేదరాలి మృతదేహానికి గ్రామస్తుల అంత్యక్రియలు



దహన సంస్కారాలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

తాండూరు రూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దండాపూర్ గ్రామంలో నిరుపేద మహిళ సుమిత్రమ్మ సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబీకులకు ఆర్థిక స్తోమత లేక ఇబ్బందిపడ్డారు. దీంతో మాజీ సర్పంచ్‌లు శివరాజ్, కేశవరావు, కౌసల్య, నర్సింహులు, మరికొందరు తలా కొంత డబ్బు పోగుచేసి ఆమె కొడుక్కు ఇచ్చారు.గ్రామంలోని వైకుంఠధామంలో సుమిత్రమ్మ దహన సంస్కారాలను నిర్వహించారు. మృతురాలి కుటుంబీకులు గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

శారీరక, మానసిక దృఢత్వానికి క్రీడలు దోహదం



బహుమతులు అందజేస్తున్న ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి

షాబాద్, జూలై 7(ఆంధ్రజ్యోతి): శారీరక, మానసిక దృఢత్వానికి క్రీడలు దోహదం చేస్తాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎలుగంటి వెంకట్‌రెడ్డి అన్నారు. ఏఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వారం రోజులుగా షాబాద్‌లో పీఆర్ఆర్ స్టేడియంలో నిర్వహించి క్రికెట్ పోటీల్లో విజేతలకు సోమవారం బహుమతులు అందజేశారు. వారు మాట్లాడుతూ.. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఏఎంఆర్ ట్రస్ట్ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, అశోక్, నాయకులు రాహుల్‌గుప్తా, గౌరీశ్వర్, శ్రీనివాస్, రఫీక్, మహేశ్, గౌతమ్, దయాకర్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

జీవో 282ను రద్దు చేయాలి



జీవో ప్రతులను దహనం చేస్తున్న కార్మికులు

కీసర, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తెచ్చిన జీవో 282ను రద్దు చేయాలని నాగారం మున్సిపల్ కార్మికులు సోమవారం గోధుమకుంటలో ఆందోళనచేశారు. కార్మిక చట్టాలప్రకారం రోజుకు 8గంటలే పని చేస్తామన్నారు. కొత్త జీవో 282 ప్రకారం కార్మికులు రోజుకు 10 గంటలు పనిచేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల హక్కులను కాలారాసేలా కొత్త జీవో తెచ్చారని, ఆ జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే కార్మికులు ఏకమై ఆందోళనలు ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని వారు హెచ్చరించారు.

ఒక్క గది.. ఐదు తరగతులు.. ఒక్కడే టీచర్!

- రాంపూర్ మీది తండాలో ఏడేళ్లుగా ఏకోపాధ్యాయుడి బోధన
- ఉన్న ఒక్క సార్ సెలవు తీసుకుంటే పాఠశాలకు సెలవే!



ఐదు తరగతుల విద్యార్థులకు ఒకే గదిలో బోధిస్తున్న ఉపాధ్యాయుడు

తాండూరు రూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్ మీది తండా పాఠశాలలో ఐదు తరగతులకు ఒకే ఉపాధ్యాయుడు ఉన్నాడు. ఐదు తరగతులకు అతడే బోధిస్తున్నాడు. అత్యవసర సమయాల్లో ఆ టీచర్ లీవ్ పెడితే పాఠశాలకు సెలవే అన్న చందంగా పరిస్థితి ఉంది. ఈ స్కూల్‌కు కనీసం ఇద్దరు టీచర్లనయినా నియమించాలని తండా వాసులు కోరుతున్నారు. ఈ పాఠశాల 2018 నుంచి ఏకోపాధ్యాయ పాఠశాలగా కొనసాగుతోంది. అన్ని తరగతుల్లో కలిపి 31మంది విద్యార్థులున్నారు. పాఠశాల హెచ్‌ఎం కె.మనోహర్ ఉత్తమ బోధనతో గత సంవత్సరం నిత్య, ప్రవళిక, తనూజ, సాయికిరణ్, అజయ్ అనే విద్యార్థులు సంక్షేమ గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలో సీటు సాధించారు.

తరగతి గదులను నిర్మించాలి

పాఠశాలకు అదనపు గది కావాలని ఉన్నతాధికారులకు విన్నవించినా మంజూరు చేయడం లేదు. స్కూలుకు కిచెన్ షెడ్ లేదు. హెచ్‌ఎం.. ఎంఈవో కార్యాలయానికి, క్లస్టర్ సమావేశానికి వెళ్లినా.. సెలవు తీసుకున్నా విద్యార్థులకు బోధించే వారు లేకుండాపోతున్నారు. ఉన్నతాధికారులు మరో ఉపాధ్యాయుడిని లేదా వలంటీరునైనా నియమించాలని, పాఠశాలకు అదనపు గదులు నిర్మించాలని తండా వాసులు కోరుతున్నారు.

ఎమ్మార్పీఎస్ పోరాటంతోనే సంక్షేమ ఫలాలు



కేక్ కట్‌చేస్తున్న ఎమ్మార్పీస్ నాయకులు

శంకర్‌పల్లి, జులై 7 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఉద్యమ పోరాటాలతోనే తెలంగాణ సమాజానికి సంక్షేమ ఫలాలు దక్కాయని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు యాదగిరి, ప్రధాన కార్యదర్శి ఉపేందర్ అన్నారు. ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ వేడుకలు ప్రొద్దటూరులో సోమవారం ఘనంగా నిర్వహించారు. నాయకులు జెండాను ఆవిష్కరించి సమితి వ్యవస్థాపక మంద కృష్ణ పుట్టిన రోజు వేడుక సందర్భంగా కేక్ కట్‌చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. అణగారిన వర్గాల గొంతుక మందకృష్ణ అని కొనియాడారు. 30ఏళ్ల పోరాటాన్ని ఆయన ప్రజల్లో సజీవంగా ఉంచి, రాజీలేని పోరాటం చేసి విజయం సాధించారని అన్నారు. దేశ వ్యాప్తంగా పీడిత వర్గాలను ఏకం చేసి అసమానతలు లేని నూతన సమాజ నిర్మాణమే ధ్యేయంగా ఎమ్మార్పీఎస్ అధ్వర్యంలో పనిచేస్తామని మరితం ఉత్సాహంగా పనిచేస్తామని వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు నర్సింహారెడ్డి, శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, నాయకులు నర్సింహ, మల్లారెడ్డి. భానుప్రసాద్. రఘుపతిరెడ్డి, మల్లారెడ్డి, మోహన్‌రెడ్డి, జంగారెడ్డి, గోపాల్, శ్రీకాంత్, లింగం పాల్గొన్నారు.

జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం పథకం కింద ఇళ్లు కేటాయించాలని ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న నందనవనం కాలనీ వాసులు

రంగారెడ్డి అర్బన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): బలహీన వర్గాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఇళ్ల కోసం నందనవన వాసులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. సరూర్‌నగర్ మండలం కర్మన్‌ఘాట్‌లోని నందనవనంలో దీర్ఘకాలంలో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న తమ గుడిసెలను తొలగించి, అక్కడ జేఎన్‌ఎన్‌ఎంయూఆర్‌ఎం పథకం కింద అసంపూర్తిగా నిర్మించి వదిలేసిన ఇండ్లను రిపేర్ చేసుకుని ఐదేళ్లుగా వాటిల్లో జీవిస్తున్నామని, వాటికి పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని మస్జిద్‌పూర్ వాసులు ...

గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మస్జిద్‌పూర్ వాసులు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఇంటి స్థలాలు లేక ఎంతో మంది పేదలు ఇళ్లు నిర్మించుకోలేకపోతున్నారని, తమకు ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

ఎన్టీఆర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు



వికారాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజు, అక్బర్ డిమాండ్ చేశారు. సోమవారం వికారాబాద్ ఎన్టీఆర్ చౌరస్తాలో విద్యార్థులతో ధర్నా నిర్వహించారు. పోలీసులు వారిని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు ఫీజు కట్టనిదే విద్యార్థులకు హాల్ టికెట్లు, సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు అప్పు చేసి ఫీజులు కడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు తేజ, పవన్, అభిషేక్, సిద్ధార్థ, కార్తీక్, బద్రీనాథ్ పాల్గొన్నారు.

మహిళా శక్తి ద్వారా బస్సులు కొనుగోలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

వికారాబాద్, జూలై 7(ఆంధ్రజ్యోతి): మహిళా శక్తి ద్వారా పెట్రోల్ బంకులు, క్యాంటీన్ల నిర్వహణ, బస్సుల కొనుగోలు చేయాలని సీఈవో సూచనలు జారీ చేశారని ఏడీఆర్‌డీవో నర్సింలు తెలిపారు. సోమవారం జిల్లా సమాఖ్య సమావేశం నిర్వహించారు. 60 సంవత్సరాలు నిండిన సభ్యులతో కొత్త సంఘాల ఏర్పాటు, దివ్యాంగుల సంఘాల బలోపేతంపై చర్చించారు. 15 నుంచి 18ఏళ్ల లోపు బాలికలను సంఘాల్లో చేర్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తామని చెప్పారు. 8న మండల స్థాయిలో సంబురాలు, 9న వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో డీపీఎంలు కొమరయ్య, నర్సిములు, శేఖర్, నర్సిములు, జిల్లా సమాఖ్య ఓబీలు జానకి శ్వేత, భాగ్యలక్ష్మి, ఓబీలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులివ్వాలి

చేవెళ్ల, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం (జీటీఏ) జిల్లా అధ్యక్షుడు నర్సింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. సోమవారం చేవెళ్లలోని ప్రభుత్వ బాలుర పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. నాయకులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల బదిలీల్లో అన్ని క్యాడర్లలో ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఉన్నారు.



సమ్మె కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

» సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణ

మహేశ్వరం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ పరిరక్షణతో పాటు విద్యుత్ బస్సుల విధానంలో మార్పు, నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు తదితర సమస్యలపై జూలై 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఆర్టీసీ కార్మికులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం మహేశ్వరం డిపో ఎదుట సమ్మె బుక్‌లెట్ కరపత్రాలను ఆర్టీసీ కార్మికులతో కలిసి విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. 29 కార్మిక చట్టాలను తొలగించి నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయాలని ప్రయత్నిస్తుందన్నారు. కోడ్‌లు అమలైతే కార్మికులు యూనియన్లు ఏర్పాటు చేసుకోవడం, ఉమ్మడి బేరసారాలు, సమ్మె హక్కులు పూర్తిగా కోల్పోతారన్నారు. అప్పుడు కార్మికులు కట్టు బానిసలుగా పని చేయాల్సి వస్తుందని, అంతేకాకుండా అవుట్ సోర్సింగ్, అప్రెంటిస్ విధానంతో నియామకాలు చేపడతారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన విద్యుత్ బస్సుల విధానంలో మార్పులు చేసి నిర్వహణ బాధ్యత, సబ్సిడీలు ఆర్టీసీకే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు వాటర్ క్యూరింగ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



సీసీ రోడ్డుపై నీళ్లు పట్టిస్తున్న కాంట్రాక్టర్

ఘట్‌కేసర్, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎన్ఎఫ్‌సీనగర్ కాలనీలోని బి-2లో సోమవారం కాంట్రాక్టర్ సీసీ రోడ్డుకు వాటర్ క్యూరింగ్ చేశారు. 'సీసీ రోడ్డు వేశారు.. నీళ్లు పట్టడం మరిచారు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన వార్తకు మున్సిపల్ అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌తో రోడ్డుకు నీరు పట్టించారు. ఎన్ఎఫ్‌సీ నగర్ కాలనీ బి-2లో రూ.20లక్షలతో సీసీ రోడ్డు నిర్మించారు. ఆ రోడ్డుకు కాంట్రాక్టర్ నీళ్లు పట్టించడం లేదు. సీసీ పగుళ్లిడ్చి నాణ్యత లోపిస్తోంది. ఇదే విషయమై కాలనీవాసులు అధికారులకు తెలిపినా వారు పట్టించుకోలేదు. దీంతో కొందరు ఇళ్ల యజమానులు వారిళ్ల ముందు నీరు పట్టారు. ఇదే విషయాన్ని ఆంధ్రజ్యోతి ప్రచురించడంతో మున్సిపల్ అధికారులు కాంట్రాక్టర్‌తో నీళ్లు పోయించారు. కొత్త సీసీ రోడ్డుకు పది రోజులైనా నిత్యం నీరు పట్టాలని, నిర్లక్ష్యం వహించిన కాంట్రాక్టర్‌కు నోటీసులిస్తామని మున్సిపల్ అధికారులు తెలిపారు. అధికారులు సీసీ రోడ్డుపై మట్టికట్టలతో మడులు కట్టించి నీరు నింపేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

అభివృద్ధిని గాలికొదిలిన కాంగ్రెస్

మహేశ్వరం, జూలై 7(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికొదిలిన కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీ, పైరవీలకే ప్రాధాన్యమిస్తోందని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. పెద్దమ్మ తండా-కొత్తూరు జరుగుతున్న రోడ్డు పనులను అధికారులు, బీఆర్ఎస్ నాయకులతో సోమవారం ఆమె పరిశీలించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధే తప్ప కాంగ్రెస్ పాలనలో చేసిన పనులేమీ కన్పించడంలేదన్నారు. మహేశ్వరం నియోజకవర్గానికి బీఆర్ఎస్ ప్రభుత్వం వందలాది కోట్లు విడుదల చేస్తే ఆ పనులన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం రద్దుచేసి రాక్షసానందం పొందుతోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప మరో హామీని అమలు చేశారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ రోడ్లకు రూపాయి కూడా విడుదల చేయలేదని, రోడ్లపై భారీ గుంతలతో ప్రజల ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రభుత్వాన్ని నడిపే అవగాహన లేదన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ వైస్‌చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు పాండుయాదవ్, ప్రభాకర్‌రెడ్డి, అంబయ్య, కె.ప్రభాకర్ పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న నారాయణగౌడ్

గీత కార్మికుల పొట్టగొడితే సహించం

ఘట్‌కేసర్ రూరల్, జూలై7(ఆంధ్రజ్యోతి): కల్లు గీత కార్మికుల పొట్ట కొడితే సహించేది లేదని అఖిల భారత గౌడసంఘం అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్ హెచ్చరించారు. కొర్రెముల కల్లుగీత కార్మికుల కో-అపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా సోమవారం రెండో రోజుకు చేరింది. ధర్నాకు నారాయణగౌడ్ మద్దతు ప్రకటించి మాట్లాడారు. రియల్ వ్యాపారులు ఇష్టారాజ్యంగా తాటిచెట్లు నరికేస్తూ కల్లు గీత కార్మికుల ఉపాధికి దెబ్బ కొడుతున్నారని, ఈ విషయాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చెట్లను నరికిన వారు పరిహారం కింద చెట్టుకు రూ.50వేల చొప్పున ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అఖిల భారత గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూరేళ్ల వేములయ్యగౌడ్, కొర్రెముల గీత కార్మికుల సొసైటీ అధ్యక్షుడు దర్శన్‌గౌడ్, నాయకులు వెంకటేశ్‌గౌడ్, పాండుగౌడ్, అనిల్‌గౌడ్, బాబురావుగౌడ్, బిక్షపతిగౌడ్ పాల్గొన్నారు.



ప్రొసీడింగ్‌ను అందజేస్తున్న రాజేశ్‌రెడ్డి

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

బొంరాస్‌పేట్, జూలై 7(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. లింగన్‌పల్లిలో సోమవారం లబ్ధిదారులకు ఇళ్ల ప్రొసీడింగ్‌లు అందజేసి ఇంటి నిర్మాణానికి స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. పేదల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు గొప్పవన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ జయకృష్ణ, నాయకులు నర్సిములుగౌడ్, రాంచంద్రారెడ్డి, వెంకట్రాములుగౌడ్, మల్లికార్జున్, కృష్ణ, కాశప్ప పాల్గొన్నారు.



నాట్య మయూరి

కోట్‌పల్లి మండలం రాంపూర్ శివారు అటవీ ప్రాంతలో సోమవారం నెమలి పురివిప్పి నాట్యం చేసింది. ఆకాశం మేఘావృతమైన సమయంలో మయూరి కొద్దిసేపు నాట్యమాడింది.

- కోట్‌పల్లి, జులై 7(ఆంధ్రజ్యోతి)

ది వైల్డర్‌నెస్ రిసార్ట్స్‌కు నోటీసులు

నేడు అన్ని అక్రమ రిసార్ట్‌లకూ అందజేత

సర్పన్‌పల్లి ఘటనతో రిసార్ట్‌ల మూసివేత

తాళాలు వేసుకొని తలదాచుకున్న నిర్వాహకులు



వికారాబాద్, జూలై 7(ఆంధ్రజ్యోతి): పుట్టగొడుగుల్లా వెలుస్తున్న అక్రమ రిసార్ట్‌ల నిర్వాకాన్ని ఎప్పటికప్పుడు పత్రికలు, మీడియా బయటపెడుతున్నా అధికారుల అండతో నిర్వాహకులు వ్యాపారాన్ని ఆపడంలేదు. కాగా సర్పన్‌పల్లి ప్రాజెక్టులో పడవ ప్రమాదంలో బిహార్‌కు చెందిన ఇద్దరు మహిళా పర్యాటకులు చనిపోవడంతో రిసార్ట్స్ నిర్వాహకుల ఆగడాలు మరోసారి చర్చనీయాంశమయ్యాయి. ఇంత జరిగినా అధికారులు రిసార్టుల జోలికి పోలేని స్థితిలో ఉన్నారంటే ఎంత స్థాయిలో మేనేజ్ చేస్తున్నారో తెలుస్తోంది. సోమవారం పంచాయతీ కార్యదర్శి స్వాతి 'ది వైల్డర్ నెస్ రిసార్ట్స్'కు నోటీసులిచ్చారు. అలాగే అనుమతుల్లేని అన్ని రిసార్ట్‌లకు నేడు నోటీసులిస్తారని తెలుస్తోంది. చెరువు పరిసరాల్లో ఆరు రిసార్ట్‌లుండగా ప్రస్తుతం వాటికి తాళాలు వేసి నిర్వాహకులు పరారయ్యారు. అక్రమాలు, ప్రమాదాలు జరిగిన సమయాల్లో గతంలోను రిసార్ట్‌లను సీజ్ చేసినా.. నిర్వాహకులు ఏదో విధంగా మేనేజ్ చేసి నెల రోజుల్లోనే తెరిచారు. అక్రమ రిసార్టుల్లో పోలీసుశాఖ నూతన సంవత్సర వేడుకలకు సైతం అనుమతిస్తోందంటే నిర్వాహకులు ఏ మేర ముడుపులిస్తున్నారో అర్థమవుతోంది. అసైన్డ్ భూముల్లో రిసార్ట్‌లు కట్టినా రెవెన్యూ శాఖ కన్నెత్తి చూడడం లేదు. ఇద్దరు మహిళల మృతి నేపథ్యంలో అయినా అక్రమ రిసార్టులపై కఠిన చర్యలు తీసుకొని మరోసారి దుర్ఘటనలు జరగకుండా చూడాలని ప్రజలు, పర్యాటకులు జిల్లా అధికారులను కోరుతున్నారు.

పదవుల పందేరం!

(ఐదో పేజీ తరువాయి)



పూర్తయినా ఇంకా ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ బలపడలేదు. దీంతో క్షేత్రస్థాయిలో నాయకత్వ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. అలాగే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అత్యంత కీలకం కానుంది. పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలు సంఖ్య గణనీయంగా పెరగనున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే జిల్లాపై కాంగ్రెస్ పట్టు పెంచుకోవాల్సి ఉంటుంది.

అన్ని నియోజకవర్గాల్లోనూ వర్గపోరు!

ఉమ్మడి జిల్లా నుంచి మంత్రివర్గంలో ఒక్కరికి కూడా స్థానం లేకపోవడం పార్టీ ఎదుగుదలపై మరింత ప్రభావం చూపుతోంది. అలాగే పార్టీకి పెద్ద దిక్కు లేకపోవడం, ఎక్కువ మంది ఎమ్మెల్యేలు విజయం సాధించకపోవడం అధికార పార్టీకి మైనస్‌గా ఉంది. చాలా నియోజకవర్గాల్లో కేడర్‌కు ఏదైనా సమస్య వచ్చినా చెప్పుకునే నాథుడే లేరు. అన్ని నియోజకవర్గాలోనూ కాంగ్రెస్‌లో వర్గపోరు నెలకొంది. ఎన్నికలకు ముందు, అధికారంలోకి వచ్చిన తరువాత ఇతర పార్టీల నుంచి కొందరు నేతలు కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. అయితే పాత, కొత్త నేతల మధ్య అనేక చోట్ల పొసగడం లేదు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో కూడా పరిస్థితి ఇలానే ఉంది. కొత్తగా చేరిన ఎమ్మెల్యేలకు గత ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థులకు పొసగడం లేదు. వీరి మధ్య సయోధ్య కుదర్చి స్థానిక ఎన్నికల సమయంలో వీరందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి పార్టీని ముందుకు నడిపే నేతలు కరువయ్యారు.

నిరాశలో పార్టీ కేడర్

మూడు జిల్లాల్లోనూ పార్టీని నడిపించాల్సిన నేతలు ఎక్కడా కనిపించడం లేదు. ఒకటి రెండు నియోజకవర్గాల్లో మినహా మిగతా చోట్ల ఎక్కడా నేతలు సమయం కేటాయించడం లేదని పార్టీ కేడర్ నుంచి విమర్శలు వస్తున్నాయి. పార్టీలో పరిస్థితులపై కాంగ్రెస్ శ్రేణులు కూడా తీవ్ర నిరాశ నిస్పృహలతో ఉన్నాయి. ఇపుడు పార్టీ సంస్థాగత నిర్మాణం జరిగితే పార్టీకి కొంత జవసత్వాలు వస్తాయని శ్రేణులు భావిస్తున్నాయి. ఇది గమనించిన కాంగ్రెస్ అధినాయకత్వం కూడా సంస్థాగత ఎన్నికలను సత్వరమే పూర్తి చేయాలని భావిస్తోంది. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టిన మీనాక్షి నటరాజన్ రాష్ట్రంలో ప్రభుత్వ పనితీరు, పార్టీ పరిస్థితిపై క్షుణంగా అధ్యయనం చేశారు. నూతన కమిటీల ఏర్పాటుకు అభిప్రాయ సేకరణ జరిపారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్టీ నిర్మాణంపై సీఎం రేవంత్‌రెడ్డి కూడా దృష్టిసారించారు.

అభిప్రాయాల సేకరణ

పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి కమిటీల ఏర్పాటు కోసం క్షేత్ర స్థాయిలో పార్టీ అధినాయకత్వం సమావేశాలు నిర్వహించింది. పార్లమెంట్ స్థాయిలో ఒక వైస్ చైర్మన్‌తో పాటు ముగ్గురు ప్రధాన కార్యదర్శులను నియమించింది. చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా బొంతు రామ్మోహన్, మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా బస్వరాజ్ సారయ్యను నియమించింది. అలాగే నియోజకవర్గ స్థాయిలో జరిగే సమావేశాల్లో అభిప్రాయాలను సేకరించింది. ఇందు కోసం జిల్లాకు ఇద్దరు పరిశీలకులను పంపింది. ఇప్పటికే అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సమావేశాలు ముగిశాయి.

క్రమశిక్షణకు మారుపేరు కేజీబీవీలు

» అదనపు గదుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

చౌదరిగూడ, జూలై 7(ఆంధ్రజ్యోతి): కస్తూర్బా బాలికా విద్యాలయాలు క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తున్నాయని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం కొందుర్గు మండలం పులుసు మామిడిలోని కేజీబీవీలో రూ.2.3కోట్లతో నిర్మించినతరగతి గదులు, జెడ్పీ పాఠశాల సైన్స్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. విద్యార్థినులు బోనాలు, ఆట పాటలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శంకర్ మాట్లాడుతూ.. అక్షరంతోనే జీవితం మలుపు తిరుగుతుందని, అక్షరమే విజయం వైపు నడిపిస్తుందని విద్యార్థినులకు సూచించారు. టెన్త్, ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపిన పది మంది విద్యార్థినులకు ఎమ్మెల్యే 5వేల చొప్పున పారితోషికాన్ని అందజేశారు. పాఠశాలకు ప్రహరీ, సీసీ రోడ్డు లేవని టీచర్లు ఎమ్మెల్యేను కోరగా ఆయన స్పందించి స్కూల్ సమస్యలను పంద్రాగస్టులోపు తీరుస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులు ముందుకొచ్చి రూ.10పది లక్షలుపైగా విరాళాలను ప్రకటించారు.

పాఠశాల అభివృద్ధికి విరాళాల వెల్లువ...

ఎమ్మెల్యే శంకర్ విద్యాభివృద్ధికి చేస్తున్న కృషికి తాముసైతం తోడ్పాటు అందిస్తామని కాంగ్రెస్ నాయకులు విరాళాలు ప్రకటించారు. గుంజల్ పహాడ్ కృష్ణ షెడ్ నిర్మాణం, గోపాల్‌రెడ్డి, పురుషోత్తం రెడ్డి, జితేందర్‌రెడ్డిలు రూ.5లక్షలు, మల్లేష్‌గౌడ్ లక్ష చెక్కును ఎమ్మెల్యే సమక్షంలో స్కూల్ ఎస్వో నిషీకి అందజేశారు. మంగులాల్ నాయక్, బ్యాటరి కృష్ణారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ దామోదర్‌రెడ్డిలు ఒక్కొక్కరు లక్ష చొప్పున ఇస్తామని చెప్పారు. వీరేష్‌కుమార్ గ్రంథాలయానికి ర్యాక్స్ మహిపాల్‌రెడ్డి రూ.20వేలు ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీఅనురాధ, ఇన్‌చార్జి ఎంఈవో గాయత్రి దేవి, నాయకులు షరీఫా జహంగీర్, బాబర్‌ఖాన్, ఇబ్రహీం, కృష్ణారెడ్డి, బ్యాగరి రవి, నరేందర్, పహిల్వాన్, గోవర్ధన్‌గౌడ్, యాదయ్య, నర్సింహులు, రాములుగౌడ్, జీబీ కృష్ణ, సుధాకర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న కస్తూర్బా విద్యార్థినులు

రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

నందిగామ: ప్రభుత్వం 25లక్షల మంది రైతులకు రూ.21వేల కోట్ల రుణమాఫీ చేసిందని, రైతు భరోసా 9వేల కోట్లు ఇచ్చిందని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. నందిగామ మండలం చేగుర్‌లో నిర్మిస్తున్న సొసైటీ భవనానికి ప్యాక్స్ చైర్మన్ గొర్లపల్లి అశోక్, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డిలతో భూమిపూజ చేశారు. సన్న వడ్లకు బోనస్ ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధి చాటుకుందన్నారు. సొసైటీ బ్యాంకులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ వైస్‌చైర్మన్ పద్మారావు, నాయకులు శివశంకర్‌గౌడ్, నర్సింలు, కృష్ణారెడ్డి, దామోదర్‌రెడ్డి, బక్కన్నయాదవ్,కె.క్రిష్ణ, డి.కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, ఎం.శ్రీశైలం, ఎ.శివ, పి.బుచ్చయ్య, బుగ్గ నర్సింలు, వీరేందర్, వేణు, ప్యాక్స్ డైరక్టర్లు, రైతులు పాల్గొన్నారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న మహేందర్‌కుమార్‌రెడ్డి

రక్తదానంతో ప్రాణదాతలుగా నిలుస్తారు

తలకొండపల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): ప్రాణాపాయ స్థితిలో ఉన్న తోటి మనిషిని కాపాడేందుకు రక్తదానం చేసేవారు ప్రాణదాతలుగా నిలుస్తారని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ జి.మహేందర్‌కుమార్‌రెడ్డి అన్నారు. యువతీ, యువకులు రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. లింగరావుపల్లిలో సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హెలెన్ కెల్లర్ జయంతి వారోత్సవాల సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ జి.చెన్నకిషన్‌రెడ్డి, అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్‌లతో కలిసి మహేందర్‌కుమార్‌రెడ్డి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. 36 మంది రక్తదానం చేశారు. సేకరించిన రక్తాన్ని ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి బ్లడ్ బ్యాంకుల ద్వారా ఉచితంగా అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జోన్ చైర్మన్ జూలూరి లింగయ్య, కోశాధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా చైర్మన్‌లు ఎం.అంజయ్య, ఓంకారం, జె.రమేశ్, రక్తదాత బి.అంజిరెడ్డి, క్లబ్ సభ్యులు పాండురెడ్డి, పి.అంజయ్య, మోహన్‌రెడ్డి, విండో చైర్మన్ కేశవరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జయంతి చారి

14, 15, 16 తేదీల్లో చండీయాగం

పరిగి, జూలై 7(ఆంధ్రజ్యోతి): అర్చక సమాఖ్య ఆధ్వర్యంలో నగరంలోని తుల్జాభవన్‌లో ఈ నెల 14, 15, 16 తేదీల్లో నిర్వహించే పంచకుండాత్మక చండీయాగాన్ని విజయవంతం చేయాలని జిల్లా అర్చక సంఘం అధ్యక్షుడు లోకూర్తి జయంతిచారి కోరారు. సోమవారం పరిగిలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చక సంఘం సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని అర్చకులంతా యాగానికి హాజరు కావాలన్నారు. సమావేశంలో గౌరవాధ్యక్షుడు కల్యాణ్‌రావు, శ్రీకాంత్, జగదీశ్వర్‌చారి, శివానందం, అఖిలేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గీతా వాహిని జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవిసదానందరెడ్డి

రేపటి నుంచి ఆలయాల్లో భగవద్గీత పారాయణం

వికారాబాద్, జూలై 7(ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మ పరిరక్షణకు గీత వాహిని బృందం గత ఏడేళ్లుగా ప్రతీ ఆషాఢంలో భగవద్గీత పారాయణం నిర్వహిస్తోందని గీత వాహిని జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవిసదానందరెడ్డి తెలిపారు. సోమవారం శివాజీనగర్ కాలనీలో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఈ సంవత్సరం కూడా భగవద్గీత పారాయణాన్ని నిర్వహిస్తామని తెలిపారు. వికారాబాద్ ప్రాంతంలోని అన్ని ఆలయాల్లో గీతా పారాయణాన్ని నిర్వహిస్తామన్నారు. హిందూ బంధువులు, భక్తులు పాల్గొనాలని కోరారు. ఈ నెల 9వ తేదీ నుంచి 17వరకు గణేష్ మండపం గాంధీకాలనీ, ఎల్లమ్మతోట-సూర్యప్రకాశ్‌కాలనీ, మల్లికార్జునాలయం-శివారెడ్డిపేట, అయ్యప్పస్వామి ఆలయం-అయ్యప్ప కాలనీ, గౌతమి కళాశాల - గరీబ్‌నగర్, రామమందరం-ఓల్డ్‌గంజ్, రేణుకఎల్లమ్మగుడి-అనంతగిరిపల్లి, హనుమాన్ ఆలయం-కొత్తగడి, వైభవలక్ష్మి ఆలయం-మారుతినగర్‌కాలనీ నిత్యం ఒక ఆలయంలో గీతాపారాయణం ఉంటుందన్నారు. సమావేశంలో గీతావాహిని ఉపాధ్యక్షులు లావణ్య, ప్రధాన కార్యదర్శి జయశ్రీ, కోశాధికారి వరలక్ష్మి, కమిటీ సభ్యులు విజయ, ఝాన్సీరాణి, నీరజ, మాధురి, సంజీవరాణి, వరలక్ష్మి, సరళ, స్వాతి, సునీత, సరిత, లక్ష్మి, రజిత, మమత ఉన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న దివ్యాంగులు

స్కూల్ అసిస్టెంట్లను నియమించాలి

రంగారెడ్డి అర్బన్, జూలై 7(ఆంధ్రజ్యోతి):హస్తినాపురం-నందనవనం ఉన్నత పాఠశాలకు స్కూల్ అసిస్టెంట్లను నియమించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్.. రంగారెడ్డి కలెక్టర్ సి.నారాయణడ్డిని లేఖ ద్వారా విన్నవించారు. ఈ లేఖను సోమవారం ప్రజావాణిలో అందజేశారు. నందనవనం పాఠశాల హైస్కూల్ స్థాయికి ఎదిగినా సబ్జెక్టుల బోధనకు స్కూల్ అసిస్టెంట్లు లేరని తెలిపారు. ఎస్జీటీ(సెకండరీ గ్రేడ్ టీచర్లు)లు మాత్రమే ఉన్నారని, హైస్కూల్ విద్యార్థులకు ఎస్జీటీలు బోధించలేరన్నారు. గణితం, సైన్స్, సోషల్, ఇంగ్లిష్, హిందీ, తెలుగు సబ్జెక్టులకు స్కూల్ అసిస్టెంట్లను నియమించాలని లేఖలో ఎంపీ కోరారు.

అదనపు కలెక్టర్‌కు దివ్యాంగుల వినతి

దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు వికలాంగుల హక్కుల పోరాట సమి తి నాయకులు వినతిపత్రం ఇచ్చారు. వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య, నాగార్జున, శ్రీనివాస్‌చారి, నర్సింహాగౌడ్, యాచారం జంగయ్య, యాదయ్య, రాములు, సలీం, పాండు, ఈశ్వర్, శంకర్ తదితరులు ఉన్నారు.



ఆర్అండ్‌బీ ఏఈకి వినతిపత్రం ఇస్తున్న సంజీవరెడ్డి

మల్కాపూర్-సంగెంకలాన్ రోడ్డు మరమ్మతులు చేయాలి

తాండూరు రూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): మల్కాపూర్ నుంచి సరిహద్దులోని సంగెంకలాన్ వరకు గుంతలుపడిన ఆర్అండ్‌బీ రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేయించాలని జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు సంజీవరెడ్డి వినతిపత్రం అందజేశారు. సోమవారం తాండూరులో గల ఆర్అండ్‌బీ కార్యాలయంలో ఏఈతో మాట్లాడారు. రోడ్డు మొత్తం గుంతలమయమై వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. బస్సులు, కార్లు, ఆటోల మాట అటుంచితే ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లలేకుండా రోడ్డు తయారైందన్నారు. తాత్కాలిక మరమ్మతులైనా చేయించి సమస్యను పరిష్కరించాలని ఫిర్యాదులో కోరారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చొరవతీసుకొని రోడ్డును బాగుచేయించాలని విజ్ఞప్తి చేశారు.



ఘనంగా పీర్ల ఊరేగింపు

చౌదరిగూడ ,జూలై 7(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంతోపాటు చౌదరిగూడ, జిల్లేడ్, తూంపల్లి తదితర గ్రామాల్లో పీర్ల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. కుల మతాలకు అతీతంగా భక్తులు పాల్గొని పీర్లకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సయ్యద్ హఫీజ్, శ్రీధర్‌రెడ్డి, అక్రం, అజ్మీరీ, జానీ, ఇస్మాయిల్, రాంచంద్రయ్య, బాబురావు, అంజనేయులు, నరసింహారెడ్డి, బాల్‌రాజ్, సంజీవరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

యాచారం, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి, నందివనపర్తి, తక్కళ్లపల్లి, నజ్దిక్‌సింగారం, అయ్యవారిగూడ, యాచారం గ్రామాల్లో మంగళవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పర్యటించనున్నారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మస్కు నర్సింహ తెలిపారు. ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు మాజీ ఎంపీటీసీలు, అధికారులు పాల్గొనాలని కోరారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

షాద్‌నగర్ అర్బన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ సమస్యను తీర్చాలని, కార్మికుల హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 9న తలపెట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో నిరుద్యోగ యువత, కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పాలమూరు అధ్యాయన వేదిక కన్వీనర్ రాఘవచారి సోమవారం ప్రకటనలో కోరారు. దేశంలో రోజురోజుకూ నిరుద్యోగం పెరుగుతున్నదని, ఉపాధి కోసం విదేశాలకు వెళ్తున్న యువత తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల హక్కులను యాజమాన్యాలు కాలరాస్తూ వెట్టిచారికి చేయించుకుంటున్నాయని ఆరోపించారు. దేశవ్యాప్తంగా చేపట్టనున్న సమ్మెతో ప్రభుత్వాలకు కనువిప్పు కల్గించాలన్నారు.

ఏకగ్రీవంగా మంచాల కురుమ సంఘం ఎన్నిక

మంచాల, జూలై 7(ఆంధ్రజ్యోతి): మంచాల కురుమ సంఘం బీరప్పదేవాలయ కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాలే శ్రీ శైలం, ఉపాధ్యక్షుడిగా కోడూరి లింగస్వామి, ప్రధాన కార్యదర్శిగా రావుల శి వకుమార్, కోశాధికారిగా చీర ఐలయ్యతోపాటు 12 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. రావుల చంద్రయ్య, గౌర జంగయ్య, శంకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు, వాటర్ బాటిళ్లు అందజేత

చౌదరిగూడ జూలై 7(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడ పరిధిలోని వీరన్నపేట్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు జాతీయ మానవ హక్కుల, నేర నియంత్రణ సంస్థ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు లకాకరకుల అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. హెచ్‌ఎం వీరేష్, సంస్థ నిర్వాహకులు హరీశ్, సందీప్, నర్సింగ్, సలీం, సంతోష పాల్గొన్నారు.

ఓటు నమోదు తప్పనిసరి

చౌదరిగూడ, జూలై 7(ఆంధ్రజ్యోతి): 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి డీటీ బాలవర్ధన్ కోరారు. సోమవారం కొందుర్గు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌వోలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తప్పులు లేకుండా ఓటరు జాబితాను ఉండాలన్నారు. కార్యక్రమంలో కొందుర్గు నాయబ్ తహసీల్దార్ రాకేష్, ఇమాన్యుయేల్, ఆర్ఐ ప్రకాశ్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ప్లాట్లను ఎవరూ అమ్ముకోవద్దు

(ఐదో పేజీ తరువాయి)

లాటరీ పద్ధతిన కందుకూరు, యాచారం మండలాల పరిధిలోని ఏడు గ్రామాలకు చెందిన భూ నిర్వాసితులకు 60గజాల ఇంటి స్థలాలను కేటాయించారు. ఎమ్మెల్యేలు సబితారెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డిల సమక్షంలో లాటరీ తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్ని సదుపాయాలతో హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో డెవలప్ చేసిన లేఅవుట్‌లోని ప్లాట్లను రాష్ట్ర ప్రభుత్వమే రిజిస్ట్రేషన్ చేసి ఫార్మా భూ నిర్వాసితులకు అందజేస్తుందని తెలిపారు. ఈరోజు రెండు మండలాలకు సంబంధించిన 670మంది రైతులకు 60గజాల చొప్పున ప్లాట్లను కేటాయించి, వారికి యాజమాన్య హక్కులు కల్పించినట్లు పేర్కొన్నారు.

ప్రతిపక్షాల పోరాటంతోనే రైతులకు ప్లాట్లు

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఫార్మాసిటీ కోసం భూములు ఇచ్చిన రైతులు నష్ట పోకుండా హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసి ప్లాట్లను కేటాయించడానికి మాజీ సీఎం కేసీఆర్ ప్రత్యేకమైన జీవో తెచ్చారని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి తెలిపారు. ప్రతిపక్షాల పోరాటాలతోనే రైతులకు ప్లాట్లు దక్కాయని ఆమె అన్నారు. మీర్కాన్‌పేట రెవెన్యూ పరిధిలో అభివృద్ధి చేసిన వెంచర్ రాబోయే రోజుల్లో ఎంతో అభివృద్ధి చెందుతుందని, ఇందులోని ప్లాట్లను రైతులు అమ్ముకోవద్దని సూచించారు.



మీర్కాన్‌పేటలో రైతుల సమస్యలను అధికారులకు వివరిస్తున్న సబితాఇంద్రారెడ్డి

విషపూరిత కంపెనీలు తేవాలని చూశారు

కందుకూరు, యాచారం మండలాల్లో గత పాలకులు విషపూరిత కంపెనీలు ఏర్పాటు చేయాలని చూశారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫార్మా సిటీకి బదులు గ్రీన్ ఫార్మసిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మీర్కాన్‌పేట ప్రాంతం రాబోయే రోజుల్లో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రెండు మండలాల్లో రైతుల నుంచి అతితక్కువ ధరలకు భూములు సేకరించిందని, వారు నష్టపోవద్దని ప్లాట్లను అందిస్తున్నామని తెలిపారు. నాలుగేళ్లలో ఈ ప్లాట్లు కనీసం రెండు, మూడు కోట్ల రూపాయల ధర పలికే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, డీపీవో సురేష్‌మోహన్, టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ శ్రావణ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, కందుకూరు, ఇబ్రహీంపట్నం ఆర్డీవోలు జగదీశ్వర్‌రెడ్డి, అనంతరెడ్డి, తహసీల్దార్‌లు కె.గోపాల్, అయ్యప్ప పాల్గొన్నారు.

కార్యకర్తలను కాపాడుకుంటాం

కడ్తాల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కడ్తాల్ మండలం ఎక్వాయిపల్లి గ్రామంలో సోమవారం దివంగత ఆమనగల్లు మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పాలకుర్ల బుగ్గయ్యగౌడ్ నాలుగో వర్ధంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి టీపీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలకుర్ల రవికాంత్‌గౌడ్‌తో కలిసి హాజరై బుగ్గయ్యగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీటీసీ, బుగ్గయ్య సతీమణి ఉమావతి అధ్యక్షతన నిర్వహించిన వర్ధంతి సభలో ఎమ్మెల్యే బుగ్గయ్యగౌడ్ సేవలను గుర్తు చేశారు. ఆమనగల్లు పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్, నాయకులు కరుణాకర్ గౌడ్, యాదయ్యగౌడ్, రమేశ్‌నాయక్, సుమన్, మల్లేశ్, అజీజ్, శ్రీను, లక్ష్మణ్, చందు, శ్రీకాంత్, వెంకటేశ్, మధు, మహేశ్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మండల సాధనే లక్ష్యం

తలకొండపల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంగా ప్రకటించేంత వరకు పోరాటం కొనసాగిస్తామని గట్టిప్పలపల్లి గ్రామ జేఏసీ నాయకులు ప్రకటించారు. తలకొండపల్లి మండలంలోని గట్టిప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 247వ రోజుకు చేరాయి. దీక్షలకు సంఘీభావంగా వివిధ పార్టీలు, సంఘాల నాయకులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రం ఏర్పాటుకు గట్టిప్పలపల్లి గ్రామం అన్నీ విధాలుగా అనుకూలంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు అశోక్‌గౌడ్, ఆంజనేయులు, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణయ్య, వెంకటయ్య, అనిల్, శరత్ చంద్ర పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఉద్యోగమిచ్చిన కంపెనీకే టోకరా

కార్లు అమ్మి డబ్బు జమ చేయని ఉద్యోగిపై కేసు నమోదు

ఆదిభట్ల, జూలై 7(ఆంధ్రజ్యోతి): బొంగ్లూర్‌లోని పవన్ మోటార్స్ కంపెనీ ట్రూ వాల్యూలో పని చేసే ఉద్యోగిపై కేసు నమోదైన ఘటన ఆదిభట్ల పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై బాల్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్, నాగోల్ సమతాపురి కాలనీకి చెందిన చొప్పరి శరత్ మూడేళ్లుగా బొంగ్లూర్‌లోని పవన్ మోటార్స్ ట్రూ వాల్యూలో టీం లీడర్‌గా పని చేస్తున్నాడు. ఒక్కోటి సుమారు రూ.20 లక్షలు విలువ చేసే కంపెనీకి చెందిన 10 కార్లు అమ్మకానికి ఉన్నాయి. ఈ క్రమంలో బొంగ్లూర్ బ్రాంచ్‌లో హెచ్ఆర్‌గా పని చేస్తున్న మలోతు మోహన్ అనారోగ్యంతో సెలవుపై వెళ్లడంతో శరత్ ఆ 10 కార్లను అమ్మేశాడు. అమ్మిన డబ్బులు కంపెనీకి చెల్లించకుండా తన వద్దే పెట్టుకున్నాడు. అయితే హెడ్ ఆఫీస్‌కు చెందిన మహ్మద్ అంజాద్ పాషా బొంగ్లూర్ బ్రాంచ్‌లో నెల క్రితం ఆడిట్ చేయగా విషయం బయటపడింది. కంపెనీకి చెందిన మేనేజర్ డబ్బులు ఇవ్వాలని శరత్‌ను అడిగితే నెల రోజులుగా తప్పించుకుతిరుగుతున్నాడు. దీంతో అంజద్ పాషా ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంను కలిసిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు

శంషాబాద్ రూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమానికి హాజరైన సీఎం రేవంత్‌రెడ్డిని సోమవారం కాంగ్రెస్ శంషాబాద్ మండల అధ్యక్షుడు గడ్డం శేఖర్‌యాదవ్ కలిశారు. సీఎంను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్, డప్పు నవీన్, సంజయ్‌యాదవ్, ధనునంజయ్, ఖాజబాయి, ఇస్మాయిల్, గణేశ్‌నాయక్, రమేశ్, అశోక్, అంజన్న, రాములునాయక్, రవినాయక్, రఘు, కృష్ణ, నరసింహ ముదిరాజ్, దేవేందర్‌కుమార్, సంజు, జగదీశ్, శ్రీనాథ్, ప్రభు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న శేఖర్‌యాదవ్

మద్యం దుకాణంలో చోరీ

చేవెళ్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తులు మద్యం దుకాణంలో చోరీకి పాల్పడి అందులో ఉన్న రూ.4.30 లక్షలు ఎత్తుకెళ్లిన ఘటన చేవెళ్ల పరిధిలో చోటు చేసుకుంది. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్లలోని శ్రీ లక్ష్మీనర్సింహ మద్యం దుకాణంలో క్యాషియర్ రాజేందర్‌రెడ్డి రోజు మాదిరిగానే మద్యం అమ్మిన నగదును రాత్రి మద్యషాపు యజమాని శ్రీకాంత్‌రెడ్డికి ఇచ్చి వెళ్లేవాడు. అయితే శ్రీకాంత్‌రెడ్డి శ్రీశైలం వెళ్లాడు. దీంతో రాజేందర్‌రెడ్డి ఆదివారం వచ్చిన నగదు రూ.4 లక్షల 38 వేలు దుకాణం క్యాష్ కౌంటర్‌లో పెట్టి తాళాలు వేసి యజమానికి సమాచారం ఇచ్చి వెళ్లిపోయాడు. సోమవారం ఉదయం 10 గంటలకు వచ్చి చూడగా డబ్బులు కన్పించలేదు. దీంతో వెంటనే పోలీస్‌లకు సమాచారం అందించాడు. పోలీస్‌లు సంఘటన స్థలంకు చేరుకుని సీసీ కెమెరాలు పరిశీలించారు. అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు ముఖానికి పూర్తిగా మాస్క్ వేసుకుని వైన్స్ షాప్ వెనుక భాగంలో గోడకు రంధ్రం చేసుకుని దుకాణంలోకి ప్రవేశించి క్యాష్ కౌంటర్‌లో ఉన్న మొత్తం నగదును తీసుకొని వెళ్తున్నట్లు సీసీ కెమెరా దృశ్యాలు పోలీస్‌లు సేకరించారు. దీంతో యజమాని శ్రీకాంత్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్‌లు స్పష్టం చేశారు.



వినతిప్రతం ఇస్తున్న నాయకులు

దివ్యాంగుల పింఛన్లు వెంటనే ఇవ్వాలి

చేవెళ్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పెండిగ్‌లో ఉన్న దివ్యాంగుల పించన్లు వెంటనే విడుదల చేయాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక చేవెళ్ల మండల అధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెన్షన్లను పెండింగ్‌లో పెట్టొద్దని కోరారు. ప్రభుత్వం దివ్యాంగుల కార్పొరేషన్ బలోపేతానికి చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు నాగేశ్, సభ్యులు రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయించాలి

కందుకూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఆస్తుల కోసం కాదు.. మా పో రాటం ఆరడుగుల జాగ కోసమంటూ మండంలోని దెబ్బడగూడ మాజీ సర్పంచ్ దేరంగుల జంగ య్య అన్నారు. సోమవారం గ్రామస్తులతో కలిసి గ్రామంలో శ్మశానవాటికను గుర్తించాలంటూ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడారు. శ్మశానవాటిక లేక 30 ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. తమ గ్రామంలో స్థలం లేక మహ్మద్‌నగర్ గ్రామంలోని శ్మశానవాటిక స్థలాన్ని చూపించారన్నారు. అయితే అక్కడ దహన సంస్కారాలకు ఆ గ్రామస్తులు ఒప్పుకోవడం లేదని వాపోయారు. అధికారులు సమస్యను గుర్తించి దెబ్బడగూడ రెవెన్యూ పరిధిలోని 59 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిలో శ్మశానవాటికు స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు వెంకటయ్య, విఠల్, శ్రీరాములు, సత్యనారాయణ, నగేష్, ఎండీ ఖాసీం, రాజు, శేఖర్, జైపాల్, సత్తయ్య, కిష్టయ్య, మల్లేష్, శ్రీనివాస్, రాజేందర్, సిద్ధు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న దెబ్బడగూడ గ్రామస్తులు

వైద్య శిబిరానికి స్పందన

ఆమనగల్లు, జూలై 7(ఆంధ్రజ్యోతి): అంధత్వ నివారణ కార్యక్రమాన్ని ఐక్యత ఫౌండేషన్ ఉద్యమ స్ఫూర్తితో ముందుకు తీసుకుపోతుందని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. కంటి సమస్యలతో కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలు ఇబ్బంది పడొద్దన్న ఉద్దేశంతో ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సోమవారం సీకేఆర్ ఫంక్షన్ హాల్‌లో మూడో రోజు నిర్వహించిన కంటి వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. చెన్నై శంకరన్ నేత్రాలయ సహకారంతో నిర్వహించిన శిబిరానికి 700 మంది రాగా 550 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 350 మందికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. 30 మందికి కంటి శుక్లాలు ఉన్నట్లు గుర్తించి వారిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు, యూసుఫ్‌బాబా, మల్లయ్య, గణేశ్, శ్రీపతి, శేఖర్, రవి, యాదయ్య, శ్రీను, శివ, కళ్యాణ్, అబినవ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



అద్దాలు పంపిణీ చేస్తున్న రాఘవేందర్ రెడ్డి

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

తలకొండపల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): కార్పొరేటుకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రులను తీర్చిదిద్ది పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరంగా నిలుస్తుందన్నారు. తలకొండపల్లి మండలంలోని చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన లక్ష్మారెడ్డికి రూ.25వేలు, ఈశ్వర్‌కు రూ.6.500 కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. సోమవారం లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు చెక్కులు పంపిణీ చేశారు. నాయకులు ప్రదీప్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, మహేశ్, జాజాల నరేశ్ పాల్గొన్నారు.

కొత్తపేటకు బస్సు



బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వరప్ప

కేశంపేట, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపేట గ్రామానికి నూతన బస్సు సర్వీసును సోమవారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పట్లూరి జగదీశ్వరప్ప ప్రారంభించారు. కొత్తపేట నుంచి ఉదయం 3.30గంటలకు బయలుదేరి సంతాపూర్, చిప్పలపల్లి, పోరండ్ల, కోళ్ల పడకల్, శంషాబాద్ మీదుగా మెహదీపట్నం చేరుకుంటుందని తెలిపారు. తిరిగి అదే రూట్‌లో కొత్తపేటకు వస్తుందని పేర్కొన్నారు. ఆయా గ్రామల ప్రజలు, రైతులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నూతనంగా బస్సు వేయించేందుకు సహకారం అందించిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్యాక్స్ డైరెక్టర్ అంజనేయులు, నాయకులు పట్లూరి మహేష్, అంజయ్య, రంగు శంకర్, గణేష్, గోవిందు, గోపాల్, ఉస్మాన్, శ్రీధర్, నాగుల కుమార్, కుతుబుద్దీన్, నరసింహ రెడ్డి, సురేష్, అంజయ్య గౌడ్, బాలరాజు, సాయిలు, ప్రసాద్, రవి యాదవ్, అశోక్, యాదయ్య, నరేష్, ఖలీల్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి

షాబాద్, జూలై 7(ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు దండు యాదవరెడ్డి కోరారు. షాబాద్ రైతు వేదికలో సోమవారం సంఘం నాయకులతో కలిసి విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బొబ్బిలిగామలో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు పనిచేయడం లేదని వారంరోజులుగా చెబుతున్నా ఏఈ పట్టించుకోవడం లేదన్నారు. బొబ్బిలిగామంలో రోడ్డు పక్కన వైర్లు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయని, విద్యుత్ సమస్యలు తలెత్తితే అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులే స్వయంగా రిపేర్ చేసుకోవలసి వస్తుందన్నారు. విద్యుత్ అధికారులకు డబ్బులిస్తేనే తప్ప పని చేయడంలేదని ఆరోపించారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణరెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు కృష్ణ, సత్యంగౌడ్, మల్లేష్, రైతులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు

విరివిగా మొక్కలు నాటాలి

కేశంపేట, జూలై 7(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని మాజీ వైస్ ఎంపీపీ నరసింహ యాదవ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో వన మహోత్సవంలో భాగంగా సోమవారం మాజీ వైస్ ఎంపీపీ వ్యవసాయ క్షేత్రంలో టేకు మొక్కలు నాటారు. వన మహోత్సవంలో విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో కిష్టయ్య, నాయకులు కర్రెడ్ల నరేందర్ రెడ్డి, చౌదం శ్రీనివాస్, రవి, కృష్ణయ్య, బాలరాజ్ పాల్గొన్నారు.

గోశాలకు భూమిపూజ.. అడ్డగింత

(ఐదో పేజీ తరువాయి)

నిర్ణయించినట్లు రైతులకు వివరించారు. ప్రభుత్వం నిర్ణయాల మేరకు తాము కట్టుబడి పనిచేస్తున్నామన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే సీఎం దగ్గరకు వెళ్లి వివరించాలని సూచించారు. గోశాల నిర్మాణ అనంతరం భూబాధితులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం యోచిస్తుందన్నారు. అధికారుల విధులకు ఆటంకాలు సృష్టించవద్దని కోరారు. ఏసీపీ కిషన్, మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. అయితే రెవెన్యూ అధికారులు సదరు ప్రభుత్వ భూమిని జేసీబీతో చదును చేస్తుండగా ఎన్కేపల్లి గ్రామస్థులు అడ్డుకున్నారు. జేసీబీపై దాడి చేశారు. దీంతో అధికారులు వెనుదిరిగారు. ఈ విషయంపై ఎమ్మెల్యే కాలె యాదయ్యను వివరణ కోరేందుకు ఆంధ్రజ్యోతి ప్రయత్నించింది. ఆ సమయంలో ఆయన స్పందించారు. రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ యూనివర్సిటీలో జరిగిన వన మహోత్సవ వేడుకల్లో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకుపోయానని, దానిని ప్రభుత్వం చూసుకుంటుందని స్పష్టం చేశారని వివరించారు. పేదలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతోనే 300 గజాల స్థలాన్ని ఇవ్వాలని సీఎంను కోరినట్లు కాలే యాదయ్య పేర్కొన్నారు. కొందరు కావాలనే తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.



జేసీబీని అడ్డుకుంటున్న గ్రామస్తులు

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం, వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ జన్మదిన వేడుకలను సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేసి ప్రజలకు పంచి పెట్టారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా చోట్ల నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మార్పీఎస్ మండలాల అధ్యక్షులు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణకు మార్గం ఏర్పడిందన్నారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, జూలై 7



ఇబ్రహీంపట్నం: కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకుంటున్న నాయకులు



యాచారం: డప్పు వాయిస్తున్న ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు



చేవెళ్ల: ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు



షాద్‌నగర్ అర్బన్: ఎమ్మార్పీఎస్ జెండాకు సెల్యూట్ చేస్తున్న నాయకులు

కొత్తపేటలో మట్టి అక్రమ తవ్వకాలు

అధికారుల రంగ ప్రవేశంతో నిలిపివేత

కేశంపేట, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపేట ఊర చెరువులో నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. కొందరు గృహ నిర్మాణ అవసరాలకు మట్టిని తీసుకుపోతుండగా, ఇదే అదునుగా భావించిన కొందరు అక్రమార్కులు మట్టి దందాకు తెరలేపారు. కొత్తపేట శివారు పాటిగడ్డ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలుకు గతంలో మట్టిని తరలించారు. అయితే మరింతగా మట్టి అవసరం ఉండడంతో సోమవారం చెరువు నుంచి మట్టిని తరలించే పనులు మొదలు పెట్టారు. ఫంక్షన్ హాల్‌కు మట్టిని తరలిస్తున్నారన్న సమాచారం అందుకున్న ఆర్ఐ నివేదిత సిబ్బందిని పంపించి అనుమతులు మట్టి తొవ్వాకాలను నిలిపివేశారు.

ఆర్థికసాయం అందజేత

కేశంపేట/తలకొండపల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బైర్కాన్‌పల్లి గ్రామానికి చెందిన గాదెకాడి సాయిలు సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. కేశంపేట మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్ రెడ్డి రూ.5,000 కాంగ్రెస్ నాయకులతో పింపించారు. అలాగే మాజీ సర్పంచ్ రూప్లానాయక్ రూ. 1,000 అందించారు. ఇరువురి నగదును రూప్లానాయక్, అంజయ్య బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో కుమార్, తదితరులు పాల్గొన్నారు. అలాగే తలకొండపల్లి మండల పరిధిలోని వెంకట్రావ్‌పేట్ గ్రామానికి చెందిన కల్వకోలు చంద్రయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం చంద్రయ్య మృతదేహాన్ని మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ సందర్శించి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఉప్పల చారిటబుల్ ట్రస్టు ద్వారా వెంకటేశ్ సమకూర్చిన రూ.3వేలు, మాజీ సర్పంచ్ హైమావతి రమేశ్ రూ.2వేలు ఆర్థికసాయం అందించారు. బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రాజు, పాండురంగయ్య, తోట శ్రీనివాస్, ఎండీ. జహంగీర్, పిప్పళ్ల శ్రీశైలం, కానుగుల సత్యనారాయణ, జంగయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.